VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
శుక్రవారం 12 ఏప్రిల్ 2024
సంపుటి.01 సంచిక.252



## తెలంగాణలో కొన్నిచోట్ల ఈదురుగాలలతో వర్షం

### హెచ్చరించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్: ద్రోణికి తోడు తాజాగా ఆగ్నేయ రాజస్థాన్ ప్రాంతంలో కేంద్రీకృతమైన ఆవర్తనం నుండి మధ్య మహారాష్ట్ర,దక్షిణ కొంకణ్ మీదుగా కోస్తా కర్ణాటక ఉత్తర ప్రాంతాల వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ. ఎత్తులో కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో కింది స్థాయి గాలులు దక్షిణ, ఆగ్నేయ దిశల నుండి వీస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో రెండ్రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడ అక్కడ కురిసే అవకాశం వుంది.

# కవితను అరెస్ట్ చేసిన సీబీఐ



### దిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితను సీబీఐ అరెస్ట్ చేసింది.

### ఇదే కేసులో గత నెల 15న ఆమెను ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

### నేడు రౌజ్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచే అవకాశం రిమాండ్ కోరనున్న కేంద్ర దర్యాప్తు సంస్థ

**దిల్లీ :**మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితను సీబీఐ అరెస్ట్ చేసింది. ఇదే కేసులో గత నెల 15న ఆమెను ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కవిత జ్యుడిషియల్ కస్టడీలో భాగంగా తిహాడ్ జైలులో ఉండగానే సీబీఐ గురువారం ఉదయం అరెస్ట్ చేసింది. కోర్టు అనుమతితో ఈ నెల 6న జైలులోనే ఆమెను సీబీఐ బృందం విచారించింది. ఈ కేసులో సహ నిందితుడైన గోరంట్ల బుచ్చిబాబు ఫోన్ నుంచి సేకరించిన వాట్సప్ సంభాషణలు, ఓ భూ లావాదేవీకి సంబంధించిన పత్రాలు, ఆప్ నేతలకు ఇచ్చినట్లు చెబుతున్న రూ.100 కోట్ల లావాదేవీలపై ఆమెను విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఐపీసీ సెక్షన్ 120-బీ (నేరపూరిత కుట్ర), సెక్షన్ 477-ఏ (ఖాతాల తారుమారు), అవినీతి నిరోధక(పీసీ) చట్టం సెక్షన్ 7 (ప్రభుత్వ ఉద్యోగులకు లంచం ఇవ్వడం) కింద అరెస్ట్ చేసింది. రంజాన్ కారణంగా గురువారం సెలవు కావడంతో.. శుక్రవారం రౌజ్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టి కస్టడీ కోరనుంది. ఒకవేళ కస్టడీకి కోర్టు అనుమతిస్తే.. ఆమెను తిహాడ్ జైలు నుంచి సీబీఐ ప్రధాన కార్యాలయానికి తరలించి అక్కడ ప్రశ్నించే అవకాశం ఉంది.

**అరెస్టును సవాల్ చేస్తూ పిటిషన్**

ముందస్తు నోటీసు ఇవ్వకుండా కవితను సీబీఐ అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆమె తరఫు న్యాయవాదులు గురువారం రౌజ్ అవెన్యూ కోర్టులోని ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కవిత తరఫున న్యాయవాదులు నితేశ్ రాణా, మోహిత్‌రావు, సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీల్‌మణి వాదనలు వినిపించారు. ఇప్పటివరకు తన ముందు దిల్లీ మద్యం కేసుకు సంబంధించిన వాదనలు జరగలేదు కాబట్టి.. ఈ పిటిషన్‌లో ఎలాంటి ఉపశమనం ఇవ్వలేనని జడ్జి మనోజ్ కుమార్ స్పష్టంచేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రెగ్యులర్ కోర్టు ముందు దరఖాస్తు దాఖలు చేసుకోవాలని సూచించారు. "కవితను జైలులో సీబీఐ అరెస్ట్ చేసినట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు. రిమాండ్ కోసం గాని, ఇంకో అవసరం కోసం గాని ఈరోజు నిందితులెవర్నీ కోర్టు ముందు హాజరుపర్చడం లేదని కూడా తెలిపారు. ఈ కేసులో సీబీఐ ఎలాంటి దరఖాస్తు దాఖలు చేయడం లేదన్నారు. కేసుకు సంబంధించిన వివరాలు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కే తెలియదు. మరోవైపు, కోర్టు ముందు ఎలాంటి పత్రాలు లేవు. అందువల్ల దరఖాస్తుదారులు కోరినట్లు ఉపశమనం ఇవ్వడం సాధ్యం కాదు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ముందు ఈ దరఖాస్తు ఉంచొచ్చు. దరఖాస్తును తక్షణం ఆ కోర్టుకు బదిలీ చేయాలని ఆదేశిస్తున్నా" అని న్యాయమూర్తి మనోజ్‌కుమార్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**'ముందస్తు నోటీసు లేకుండా అరెస్ట్ చేస్తారా?'**

సీబీఐ తీరుపై కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు అభ్యంతరం వ్యక్తంచేశారు. కోర్టు విచారణ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, మా వాదనలు వినకుండా కవితను జైలులో సీబీఐ అరెస్ట్ చేసింది. జైలులో అరెస్ట్ చేయాలంటే వారెంట్ ఉండాలి. కోర్టు నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. అలాంటివేమీ తీసుకోకుండా

ఏకపక్షంగా అరెస్ట్ చేసింది. తొలిసారి విచారించే సమయంలోనూ నోటీసు ఇవ్వలేదు. దాన్ని ఇప్పటికే కోర్టులో సవాల్ చేశాం. దానిపై తదుపరి విచారణను కోర్టు ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది. అది పెండింగ్‌లో ఉండగానే కవితను అరెస్ట్ చేశారు. ఇప్పటికే కస్టడీలో ఉన్న ఆమెను అరెస్ట్ చేయాల్సిన అవసరమేం వచ్చింది. శుక్రవారం కవితను కోర్టు ముందు హాజరుపరిచే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో ఏక్‌నాథ్ షిండేలు లేరు



### మా నాయకుడు రేవంత్ రెడ్డియే

### మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్య

**నల్గొండ:** బీజేపీ కుల, మతాల మధ్య ఘర్షణ పెట్టి లబ్ది పొందాలని చూస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. దేశ ఐక్యతకు జరగబోయే ఎన్నికలే నిదర్శనమన్నారు. రేవంత్ రెడ్డి 10 ఏళ్ల పాటు సీఎంగా ఉంటారన్నారు. కాంగ్రెస్ 10 ఏళ్లు అధికారంలో ఉంటుందన్నారు. కాంగ్రెస్‌లో ఏకనాథ్ షిండేలు లేరన్నారు. అలాగే తమ పార్టీలో గ్రూపులు లేవని కోమటిరెడ్డి అన్నారు.నల్గొండలో ఈద్గా వద్ద సీనియర్ నేత జానారెడ్డితో కలిసి ముస్లింలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సీఎం పదవిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అందరం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నామని తెలిపారు. ఏకనాథ్ షిండేను సృష్టించిందే బీజేపీ అని కోమటిరెడ్డి అన్నారు. మంత్రి హరీష్ రావు, మహేశ్వర్ రెడ్డిలు నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందన్నారు. పనికి రాని మాటలు, చిట్‌చాట్‌లు బంద్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు గెలుచుకుంటుందన్నారు. బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటు గెలుచుకుంటే తాను దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. మా పార్టీ అంతర్గత విషయాల్లో మహేశ్వర్ రెడ్డి జోక్యం చేసుకోవద్దని కోమటిరెడ్డి వెంకటరెడ్డి హితవు పలికారు.

## స్థిరమైన ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**రిషికేష్:** దేశంలో బలహీన, అస్థిర ప్రభుత్వాలు ఉంటే శత్రువులకు అవకాశంగా మారుతోందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఉగ్రవాద సామ్రాజ్యం బలపడుతోందని వివరించారు. ఈ సందర్భంగా విపక్షాలపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.అలాంటి పరిస్థితి ఉండొద్దని పేర్కొన్నారు. గత యూపీఏ హయాంలో నెలకొన్న పరిస్థితులను గురించి మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పేకలిస్తోందని స్పష్టం చేశారు. ఇంట్లో ఉన్న ఉగ్రవాదులను కూడా భద్రతా దళాలు హతమార్చాయని వివరించారు. ప్రధాని మోదీ గురువారం నాడు రిషికేష్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆరు దశాబ్దాల తర్వాత జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేశామని ప్రధాని మోదీ వివరించారు. ట్రిపుల్ తలాక్ చట్టాన్ని రద్దు చేశామని పేర్కొన్నారు. లోక్ సభ స్థానాలు, అసెంబ్లీ స్థానాల్లో మహిళ నేతలకు రిజర్వేషన్ కల్పించామని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగితే వన్ ర్యాంక్ వన్ పెన్షన్ అమల్లోకి వచ్చేది కాదని వివరించారు.




ఉగ్రవాదం బలపడకుండా పదేళ్ళుగా కట్టడి

రిషికేష్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



2 లో

### తెలంగాణలో హిందూ వ్యతిరేక ద్వేష ప్రచారం

## ధాన్యం దళారీలపై ఉక్కుపాదం

### జనగామ మార్కెట్లో నలుగురు ట్రేడర్ల సస్పెన్షన్

### రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని సిఎం హెచ్చరిక

హైదరాబాద్: జనగామ వ్యవసాయ మార్కెట్ లో జరిగిన ఘటనపై సర్కార్ సీరియస్ అయ్యింది. రైతుల్ని దోచిన వ్యాపారులపై పోలీసులు కేసులు పెట్టారు. కందుకూరి వెంకట్ నారాయణ, సుజాత, ఉషారాణిలపై కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 10న జనగామ మార్కెట్లో దళారులు పంటను తక్కువ ధరకే కొంటున్నారంటూ రైతులు ఆందోళన చేశారు. నలుగురు ట్రేడర్లు, మార్కెట్ కార్యదర్శి సస్పెండ్ చేశారు అడిషనల్ కలెక్టర్. ఇటు ఇదే ఇష్యూపై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. రైతులను మోసం చేసేందుకు ప్రయత్నించిన ట్రేడర్లపై కేసులు పెట్టాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో జనగామ పోలీసులు కేసులు నమోదు చేశారు. ధాన్యం కొనుగోళ్లల్లో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రైతుల కష్టాన్ని ఎవరైనా మార్కెట్ కమిటీ అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై తక్కువ చేయడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. ఈ మేరకు సంబంధిత వ్యవసాయ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లలో జరిగిన ఘటనపై రేవంత్ అధికారులను మందలించారు. రైతులను మోసం చేయడానికి ప్రయత్నించిన నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించిన అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్‌కి అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారులందరూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

కాగా మరోవైపు ధాన్యాన్ని కొనట్లేదని రైతులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. అసలే వేసవికాలం పొలంలో ధాన్యం ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పలుమార్లు ధాన్యాన్ని కొనాలని రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రైతుల విన్నపంతో ప్రభుత్వం త్వరగా ధాన్యాన్ని కొనాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా తమకు సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.



## కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది



2 లో

### లోక్‌సభ ఎన్నికల్లో దానికి బుద్ధి చెప్పాలి

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

# పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సబ్బండవర్గాలకు ప్రాధాన్యం

## పూలే జయంతి సందర్భంగా స్మరించుకున్న కెసిఆర్

## తెలంగాణ భవన్‌లో నివాలి అర్పించిన కెటిఆర్




**హైదరాబాద్:** మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఆ మహనీయుని త్యాగాలను, సమసమాజ కార్యాచరణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. పదేండ్ల తమ పాలనలో సబ్బండ వర్గాల కోసం అమలుచేసిన కార్యక్రమాల వల్ల సామాజిక ప్రగతి కార్యాచరణకు దారితీసిందని గుర్తుచేసుకున్నారు. ఒకనాడు అల్ప దృష్టితో, నిర్లక్ష్య ధోరణులతో వెనుకబడిన సమాజంగా తెలంగాణ మారిందని చెప్పారు. ఉద్యమ కాలం నుంచి రగిలిన సబ్బండ వర్గాల చైతన్యం రాష్ట్రం ప్రగతి పథంలో ముందడుగు వేసిందన్నారు. ఈ మొత్తం క్రమంలో మహాత్మా పూలే స్ఫూర్తి ఇమిడి ఉందన్నారు. తమ పదేండ్ల పాలన కాలంలో అమలైన పథకాల కార్యాచరణ బహుజన వర్గాల ఆత్మగౌరవాన్ని ద్విగుణీకృతం చేసిందని తెలిపారు. అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపిందన్నారు. అదే స్ఫూర్తి, కార్యాచరణ కొనసాగాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో బహుజనులు సమానత్వం సాధించేలా కృషి చేయడమే పూలేకు ఘన నివాళి అన్నారు. కాలంతో సంబంధం లేకుండా చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పూలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కులవివక్ష, అసమానతలపై ఆనాడే పూలే పోరాడారని చెప్పారు. విద్యతోనే సమానత్వం వస్తుందని, సావిత్రిబాయితో కలిసి అందరికి విద్య అందించేందుకు కృషి చేశారని తెలిపారు. తెలంగాణలో భవన్‌లో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మధసూదన్ చారి, కర్నెప్రభాకర్, పొన్నాల లక్ష్మయ్యతో కలిసి పూలేకు కేటీఆర్ నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పూలే ఆశయాలను ఆచరణలో పెట్టిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. వెయ్యికి పైగా గురుకులాలు ఏర్పాటుచేసి నాణ్యమైన విద్య అందించామన్నారు.గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై రూ.లక్ష 25 వేలు ఖర్చుచేశామని తెలిపారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితోనే ఈ కార్యక్రమం కొనసాగిందని చెప్పారు. ప్రతి పాఠశాలను ఇంటర్మీడియట్ కాలేజీకి అప్‌గ్రేట్ చేశామని, బీసీ విద్యార్థుల కోసం 33 డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. విదేశాల్లో చదువుకునే వారికి రూ.20 లక్షల చొప్పున స్కాలర్‌షిప్ ఇచ్చామన్నారు. ఈ విషయంలో దళిత, గిరిజన, బహుజన, అగ్రవర్ణ పేదలనే వివక్ష చూడలేదని చెప్పారు. టాటాలు, బిర్లాలు మాత్రమే ముఖ్యంకాదని, తాతలనాటి కులవృత్తులు కూడా అంతే ముఖ్యమని ఆచరణాత్మకంగా వాటికి ఒక్క రూపును, గౌరవాన్ని అందించామన్నారు. దేశమంతా స్కిల్ డెవలప్మెంట్ గురించి మాట్లాడుతున్నప్పుడు.. శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న బహుజన వర్గాల
నైపుణ్యం గురించి మాట్లాడిన వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అని గుర్తుచేశారు. అగ్గిపె÷–టటెలో పట్టిన చీర నేసే నేతన్న నైపుణ్యాన్ని తిరిగి గుర్తించామన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఉన్న అద్భుతమైన నైపుణ్యాన్ని కాపాడి వాటికి భద్రత ఇచ్చి వారికోసం అనేక కార్యక్రమాలను చేపట్టామని వెల్లడించారు. యాదవులు, ముదిరాజులు తమ వృత్తి నైపుణ్యం ద్వారా దేశంలోనే రాష్టాన్ని తమ రంగాల్లో అగ్రగామిగా నిలిపారని చెప్పారు. అదేవిధంగా ఒకప్పుడు ఊపిరి తీసుకునే నేతన్నలను ఈరోజు ఊపిరి పీల్చుకునే విధంగా తయారు చేశామన్నారు. కేసీఆర్ పథకాలతో నేత కార్మికులు నిలబడ్డారని, గీత కార్మికులకు సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేశారని తెలిపారు. ఎంబీసీల కోసం వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. దళితబంధు, బీసీ బంధు, రైతుబంధు లాంటి పథకాలు ఆయా వర్గాల దశ మార్చాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా బడుగు బలహీన వర్గాలకు సీట్లు ఇచ్చిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. అదేవిధంగా పార్లమెంట్ జనరల్ సీట్లలో సగం బీసీలకే ఇచ్చారని తెలిపారు. తద్వారా బీసీల పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని చెప్పారు. కేవలం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల కోసమే కాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజకీయ అవకాశాల కోసం కూడా పాటుపడుతున్న పార్టీ తమదని చెప్పారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల ముందు బీసీలను ఓటు బ్యాంకుగా చూసి, వారి నుంచి ఓట్లు దండుకునేందుకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మ పూలే పేరుతో రూ.20 వేల కోట్లతో బీసీ సబ్ ఎ÷–లాన్ పెడతామన్నారని, అయితే ఓట్ ఆన్ అకౌంట్ బ్జడెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదని చెప్పారు. రానున్న బ్జడెట్‌లో రూ.20 వేల కోట్లు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని చెప్పారని, ఆ మాటను నిలుపుకోవాన్నారు. బీసీలకు అంతర్జాతీయ స్థాయి గురుకులాలు పెడతామ న్నారని, మండలానికి ఒకటి చొప్పున వెంటనే ప్రారంభించాలన్నారు. రాబోయే మూడేండ్లలో ద్విశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మహాత్మ జ్యోతిబాపూలే సమున్నత విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అసెంబ్లీలో జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తమ నాయకురాలు కవిత డిమాండ్ చేశారని గుర్తుచేశారు. బీసీల విషయంలో కేవలం మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన హామీలని ఆచరణలో పెట్టాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు.



# జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దాం.

**- "సత్యశోధక్" చైర్మన్ ఆర్. నర్సయ్య.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ,** ఏప్రిల్ 11 భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న కుల వివక్ష, అంటరానితనం, మహిళలపై సాంఘిక దురాచారాలకు సామాజిక రుగ్మతలకు మూలం అవిద్యయే అని గ్రహించి మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే నమ్మి, అణగారిన వర్గాల అభ్యున్నతి కొరకు, మహిళల విద్యా వ్యాప్తికి అహర్నిశలు శ్రమించిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య అన్నారు. సామాజిక విప్లవోద్యమ పితామహుడు, సంఘ సంస్కరణలకు, మహిళల విద్యకి ఆద్యుడు, సత్యశోధక్ సమాజ స్థాపకుడు మహత్మా జ్యోతిరావు పూలే 197 వ జయంతిని గురువారం సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. మొదటగా సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్ నర్సయ్య జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలనలంకరించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయమని, అనాదిగా సమాజంలోని దురాచారాలు మూఢ నమ్మకాలు, రుగ్మతలను కూకటి వేళ్లతో సహా పెకిలించి సమాజంలోని మనుషులు అందరూ ఒక్కటే అని చాటిన నవ యుగ చైతన్య క్రాంతి కారకుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. లింగ వివక్షత, అవిద్య అజ్ఞానం కుల వైషమ్యాలు ప్రగతి నిరోధకాలని మనుషుల మధ్య సంబంధాలను మరింతగా దూరం చేస్తాయని చెప్పి మానవులు జ్ఞానవంతులు అయితే మనుగడ పురోగతిని చెందుతుందని ప్రగాఢంగా నమ్మిన పూలే అన్ని వర్గాల ప్రజలకు మార్గదర్శి అన్నారు. విశాల ప్రపంచంలో మానవ ధర్మం సన్మార్గంలో ప్రయాణించాలని సత్య శోధక్ సమాజాన్ని స్థాపించి భేదభావాలు లేని సామరస్యంతో కూడిన ఆశాజనకమైన సమాజ నిర్మాణం పూలే ధ్యేయమని నమ్మిన ఆయన మార్గంలో మనమంతా పయనించి, మహనీయుని ఆశయాల సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది

## లోక్‌సభ ఎన్నికల్లో దానికి బుద్ది చెప్పాలి

## సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



**సిద్దిపేట:** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కి గట్టిగా బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. కరువు తెచ్చిందని విమర్శించారు. తెలంగాణలో లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల రుణమాఫీ అయినా రైతులు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలి... రుణామాఫీ కానివారు బీఆర్ఎస్‌కి ఓటు వేయాలని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ఓట్లు కోసం వచ్చే ఆ పార్టీ నేతలను మహిళలు చీపురు కట్టలతో తరమాలాని వార్నిగ్ ఇచ్చారు. గురువారం నాడు చిన్నకోడూరు మండలం పెద్ద కోడూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్ రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లల్లో నిర్లక్ష్యం వహించొద్దు.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో వెంకట్ రాంరెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రులు కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య హయాంలో 6 గంటలు మాత్రమే కరెంట్ వచ్చేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 24 గంటల కరెంట్, సాగునీరు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేస్తే మన కంటిని మనం పొడుచుకున్నట్లేనని ఎద్దేవా చేశారు. సిద్దిపేట అభివృద్ధిని ఓర్వని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావుకి ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గతంలో దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్ రావు ఏ ఒక్క హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. అందుకే మొన్నటి అసెంబ్లీ ఆయనను దుబ్బాక ప్రజలు ఘోరంగా ఓడించారని అన్నారు.10 ఏళ్ల బీజేపీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని.. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు పెరిగాయని మండిపడ్డారు. బీజేపీ నల్ల చట్టలు తెచ్చి 700మంది రైతులను పొట్టన పెట్టుకుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీకి గులాం గిరి చేస్తే, గులాబీ జెండా పట్టుకున్నోళ్లు జై తెలంగాణ అని నినదిస్తారని హరీశ్‌రావు అన్నారు. తాను కలెక్టర్‌గా ఉన్న సమయంలో మెదక్ ఉమ్మడి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశానని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డి తెలిపారు. ప్రజల ఆదరణతో తాను ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నానని చెప్పారు. తాను అంచెలంచెలుగా కలెక్టర్ వరకు ఎదిగానని అన్నారు. తాను ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద బలహీన వర్గాలకు సహాయం అందిస్తానని వెంకట్ రాంరెడ్డి హామీ ఇచ్చారు.

# బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ మొసలి కన్నీరు

**హైదరాబాద్:** బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తోందని బీజేపీ రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నాడు బీజేపీ కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ...మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం పని చేస్తోందని లక్ష్మణ్ తెలిపారు. గత పాలకులు విస్మరించిన వర్గాలకు మోదీ సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. అభినవ జ్యోతి బాపూలే నరేంద్ర మోదీ అని కొనియాడారు. విద్యారంగంలోనే కాకుండా ఉపాధి రంగంలో సైతం అణగారిన వర్గాలకు ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. విశ్వకర్మ యోజన ద్వారా బలహీన వర్గాలను మోదీ ఆదుకుంటున్నారన్నారు. గణాంకాల ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు ఆడుతోందన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ బీసీ గణన అంటే ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులాన్ని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అడుగడుగునా అవమాన పరుస్తున్నారని ధ్వజమెత్తారు.
జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని .. ఆ ఎన్నికల్లో 46 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించకపోతే సీఎం రేవంత్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్టాల్లో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి బీసీల హక్కులను కాలరాస్తున్నారని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వలంటీర్లపై పూటకో మాట చంద్రబాబు తీరుపై మండిపడ్డ సజ్జల

**అమరావతి:** వాలంటీర్ల వ్యవస్థపై పూటకో మాట మాట్లాడుతున్నారని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై ఏపీ ప్రభుత్వ సలహాదారుడు, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి నేతల తీరుపై ధ్వజమెత్తారు. వాలంటర్లను తొలగిస్తామని ఒకసారి, వారికి రూ. 10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామని ఇంకోసారి ఇలా పూటకో మాట మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఓట్ల కోసం అబద్దపు హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. పింఛన్ల ఆపేందుకు అనేక కుట్రలు పన్నారని విమర్శించారు. చంద్రబాబు పవన్‌కల్యాణ్ వాలంటీర్ల వ్యవస్థపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజలు మరిచిపోలేదని వ్యాఖ్యనించారు. 1995 నుంచి ఇప్పటి వరకు చంద్రబాబు మారలేదని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తొలగించి జన్మభూమి కమిటీ సభ్యులకు బాధ్యత అప్పగించడం ఖాయమని అన్నారు. ప్రభుత్వ పథకాలతో లబ్దిపొందుతున్న ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుంటారని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో? తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని ధీమాను వ్యక్తం చేశారు. ఓటమి భయంతో టీడీపీ నాయకులు వైసీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ కేసులు నమోదు చేయడం సిగ్గుచేటని ఆరోపించారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత వైసీపీ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే జగన్ అమోఘ విజయం సాధించబోతున్నారని పేర్కొన్నారు.

# సిఎం జగన నాయకత్వమే శరణ్యం

**విజయనగరం:** బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ నాయకత్వం అవసరమని, ఆయన గెలిస్తేనే న్యాయం జరుగుతుందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇచ్చిన మాటను, హామీని నెలబెట్టుకొని ఓటు అడుగుతున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్ అని మంత్రి బొత్స అన్నారు.
విజయనగరంలో వైస్సార్సీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు కష్టపడితే మళ్లీ మన గౌరవం నిలిబెట్టుకుంటామని గుర్తుంచుకోవాలన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు ఉన్న వాటిని పక్కన పెట్టి పనిచేయాలని పిలుపునిచ్చారు. మనపై వచ్చే వ్యతిరేక వార్తలు, ప్రచారాలును తిప్పికొట్టాలి. ఈ రోజున మీడియా కన్నా.. సోషల్ మీడియా పవర్ ఫుల్‌గా ఉంది. సోషల్ మీడియా ద్వారా మన ప్రచారం పెంచండి. రాష్ట్రంలో పేదరికం ఐదేళ్లలో గణనీయంగా తగ్గింది. వ్యవసాయం కూడా అభివృద్ధి బాటలో ఉంది. అన్ని వ్యవస్థల్లో సమూల మార్పులు చేసి ఇతర రాష్ట్రాలును వెనక్కి నెట్టి ముందు వరసలోకి వచ్చాం. చంద్రబాబు హయాంలో కూటమి దోపిడీ, దౌర్జన్యాల కూటమి. చంద్రబాబుకి చెప్పుకోవడానికి ఏమిలేక బురద జల్లుతున్నారు. ఆయనలాగా జగన్ పేజీలు పేజీలు మేనిఫెస్టో హామీలు ఇవ్వలేరు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన హయాంలో ఏ రోజుయిన ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. మాయ మాటలు చెప్పే చంద్రబాబును ఎవరు నమ్మే పరిస్థితుల్లో లేరు. మన పార్టీలో అసమ్మతితో ఉన్న నాయకులను పట్టించుకోకండి. వారు వెళ్లిపోయిన పార్టీకి వచ్చిన నష్టం ఏమి లేదు. జగన్ నాయకులను నమ్ముకోలేదు.. ప్రజలను నమ్ముకున్నాడు. ప్రజల్లో ఆయనకి ఉన్న అభిమానం ఎవరు చేరపలేనిది. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అవుతారనేది 100 శాతం నిజం అని మంత్రి బొత్స పేర్కొన్నారు. పురందేశ్వరి ఐఏఎస్, ఐపీఎస్‌లు మీద లెటర్స్ రాస్తున్నారు. హెరిటేజ్ సంస్థ మేనేజర్లును పెట్టి ఎలక్షన్ చేయాలా?. మంచి, చెడు ఏది ఆలోచించకుండా బురద జల్లుతున్నారు. ఇవ్వేమి పట్టించుకోకుండా ఎలక్షన్లలోకి వెళ్లి కష్టపడండని నాయకులు, కార్యకర్తలకు మంత్రి బొత్స సూచించారు.సీఎం జగన్ ప్రభుత్వం అవసరం, ఆవశ్యకత ఈ రాష్ట్ర ప్రజలకు ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సీఎం జగన్ పెట్టిన వ్యవస్థలు దేశంలో ఎక్కడా లేవన్నారు. జగన్ అమల చేసిన సంస్కరణల వలన రాష్ట్రంలో పేదరికం తగ్గిందని తెలిపారు. విద్యలో కూడా కేరళను అధిగమించామని చెప్పుకొచ్చారు. సీఎం జగన్ చెప్పిందే చేశారని... చేయలేనివి చెప్పరని అన్నారు. ఆర్థిక కారణాల వలన సీపీఎస్ చేయలేకపోయామని... సీపీఎస్ కన్నా మెరుగైన పథకం పెట్టామని వెల్లడించారు. 14 ఏళ్ల చరిత్రలో చంద్రబాబు చెప్పింది చేశామని చెప్పగలరా అని ప్రశ్నించారు. జగన్ నాయకత్వం చేస్తున్నది నాయకులతో కాదని... ప్రజలతో అని మంత్రి అన్నారు. మానసికంగా ఆందోళనకు గురిచేసేందుకే తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కానీ అవి పట్టించుకునే పరిస్థితిలో లేమన్నారు. 30 మంది ఐఏఎస్ అధికారులపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పురందేశ్వరి ఫిర్యాదు చేశారని.. వారిని సీఎం జగన్ నియమించారా అని ప్రశ్నించారు. గతంలో వారు చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి రోశయ్య ప్రభుత్వ హయాంలో పనిచేయలేదా అని అడిగారు. వారందరిపై చర్యలు తీసుకుంటే.... ఎన్నికలు నిర్వహించేది ఎవరు..? వారిని కాదని హెరిటేజ్ ఫుడ్స్ సిబ్బందితో ఎన్నికలు నిర్వహించాలా? అంటూ మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు.

# వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న రేవంత్

## ఎమ్మెల్యే కెపి వివేకానంద ఆరోపణలు

హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి అన్ని వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని... ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ విరుచుకుపడ్డారు. మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారన్నారు. స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. పార్టీ మారిన కడియం, తెల్లం వెంకట్ రావుపై అనర్హత పిటిషన్ ఇవ్వడానికి కలిసే అవకాశం ఇవ్వడం లేదని వెల్లడించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... పోస్టల్ ద్వారా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు పిటిషన్ పంపుతున్నామని చెప్పారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మూడు మాసాల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్నారు. అనర్హత వేటు వేసే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో దీక్షలు చేస్తామని.. వారి ఇళ్ల ముందు నిరసన తెలుపుతామని అన్నారు. పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టాలని గతంలో రేవంత్ రెడ్డి అన్నారని గుర్తుచేశారు. కానీ రేవంత్ రెడ్డి మాట తప్పారని.. మరి ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలని ప్రశ్నించారు. మారిన ఎమ్మెల్యేలను కొట్టాలా? లేకపోతే... చేర్చుకుంటున్న రేవంత్‌ను రాళ్లతో కొట్టాలా? అని నిలదీశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను పక్కన పెట్టుకుని కాంగ్రెస్ ఫిరాయింపుల తీర్మానం పెట్టిందన్నారు.

# తెలంగాణలో హిందూ వ్యతిరేక ద్వేష ప్రచారం

**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎంలు కుమక్కు రాజకీయాలు చేస్తున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. అధికార పార్టీకి అండగా ఉండడం ఎంఐఎంకు అలవాటేనని అన్నారు. గత చరిత్ర తీసుకుంటే ఇది తెలుస్తుందన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా ఎంఐఎం అటువైపే ఉంటుందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ తీసుకు వస్తానన్నా మార్పు ఏమైందని ప్రశ్నించారు. ప్రజల జీవితాల్లో మార్పు రాలేదు.. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో మార్పు వచ్చిందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. మతాన్ని అడ్డం పెట్టుకొని ఎంఐఎం రాజకీయాలు చేస్తుందంటూ మండిపడ్డారు. తెలంగాణలో హిందూ వ్యతిరేక ద్వేషాన్ని రగిలిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎంలు హైదరాబాద్ అభివృద్ధిని గాలికొదిలేశాయని చెప్పారు. కాంగ్రెస్,
బీఆర్ఎస్ పార్టీలు కొత్త నాటకానికి తెర తీశాయన్నారు. ఓట్లు కోసం కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ ఎంతకైనా దిగజారతాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని ఇప్పటికే పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే తెలంగాణ బీజేపీ భారీగా లోక్‌సభ స్థానాలు గెలుచుకొంటుందని ఇప్పటికే ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.అదీకాక ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. మరోవైపు ఇదే ఎన్నికల్లో తమ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

# పూలే ఆశయాలను సాధిద్దాం

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ .

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 11:**



భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వినాయక నగర్ లో సామాజిక తత్త్వవేత్త, బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి మహాత్మా జ్యోతిరావ్ పులే 198వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పులే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ధన్ పాల్ గ మాట్లాడుతూ, మన దేశ ప్రగతి యాత్రలో వెనుకబడటానికి, వందల సంవత్సరాలు విదేశీయుల పాలనలో మగ్గడానికి, మూఢచారాలు ప్రబలడానికి కారణం ప్రజల్లో జ్ఞానం లేకపోవడమే అని గుర్తించి సమాజంలో అందరిని విద్యావంతులను చేయాలను పూలే ఉద్యమించాడని అన్నారు. జ్యోతిరావు పులే తన జీవితం అంత బడుగు బలహీన వర్గాల ప్రజలకు, స్త్రీలకు విద్య నేర్పించడానికి జీవితాన్ని అంకితం చేసారన్నారు, సత్యశోదక్ సమాజ్ ద్వారా సమాజంలో అసమానతలను, మూఢ నమ్మకాలను రూపుమాపడానికి పోరాటం చేసారని, జ్ఞానం లేకుంటే గౌరవం లభించదని, శిక్షణ లేకుంటే సమాజంలో సంస్కరణ సాధ్యం కాదని, స్త్రీలను విద్య అందించాలన్న సంకల్పంతో మొదట తన భార్య సావిత్రిభాయ్ కీ విద్య నేర్పిచి పూణే నగరంలో మొదటిసారిగా బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభించాడని అన్నారు. ఆంగ్లప్రభుత్వం పేదప్రజల కొరకు ఉచితంగా చదువు చెప్పించే ఏర్పాటు చేసి, వారి అజ్ఞానాన్ని, పేదరికాన్ని తొలగించవలసి ఉందని, ప్రజలు సుఖంగా, సంతృప్తిగా జీవించేటట్లు చూసుకోవడం ప్రభుత్వం యొక్క బాధ్యత అని, బ్రిటిష్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపిన మహనీయులు పులే అని అన్నారు. పులే దంపతులు ఇరువురు సమాజంలో అసమానతలు, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాటం చేస్తూ బాల్య వివాహలకు వ్యతిరేకంగా, వితంతు గర్భిణీలకు అండగా, అనాధ పిల్లలను అక్కున చేర్చుకున్న మహనీయులు అని, సమాజం ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేసిన, సంఘ బహిష్కరణలు చేసిన చివరికి తండ్రి కూడా ఇంటినుండి వెళ్లగొట్టిన వనవాసనికి రాముని వెంట సీతలా పులే వెంట సావిత్రి భాయ్ భర్త లక్ష్యసాధనలో తోడుండి ఈ దేశానికి మొదటి పంతులమ్మ అయిందని అన్నారు. వారి జీవితాన్ని పూర్తిగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సమానత్వం కోసం పాటుపడటం జరిగిందని, అందుకే జ్యోతిరావు పులే మహాత్ములు అయ్యారని అన్నారు. వారి ఆశయ సాధనలో మనందరం నడవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాబట్టి ఆ మహనీయుని ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీనారాయణ , రాజు, నాగరాజు గిరిబాబు నరేష్ రాజ్ కుమార్,కిషోర్ నరేష్ సురేష్ నందకిషోర్ దండు శ్రీకాంత్ పండు ప్రవీణ్,మారుతి, భూమేష్, భాస్కర్, కృష్ణ, సాయి, శ్రీనివాస్, మఠం పవన్,తదితరులు పాల్గొన్నారు.

# పూలే" ఆశయ సాధనకు పోరాడాలి.

## బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు సిద్దిరాములు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 11:**



బహుజన హక్కుల ఉద్యమ సిద్ధాంత కర్త, సామాజిక న్యాయం తత్వవేత్త జ్యోతి రావు పూలే ఆశయ సాధనకు పోరాడాలనీ బిఎల్పి రాష్ట కార్యదర్శి, బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు సిద్దిరాములు పిలుపునిచ్చారు. మహా త్మా జ్యోతి రావు పూలే 197 వ జయంతి సందర్భంగా గురువారం పూలే విగ్రహానికి బిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సిద్దిరాములు మాట్లాడుతూ, మహాత్మా జ్యోతి రావు పూలే అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా బహుజన వర్గం ప్రజల కోసం తమ జీవితం ను త్యాగం చేశారనీ అన్నారు. భారతదేశంలో పీష్వాల కాలం నాటి మూఢ విశ్వాసాలను, అహంకార పూరితమైన మత ఆచారాలను, మనుషుల మధ్య కులం పేరుతో, మతం పేరుతో సృష్టించిన వివక్షను వ్యతిరేకించడంతో పాటు ఉద్యమించాడని అన్నారు. భారతదేశం యావత్తు చదువుకొని, తల ఎత్తుకొని జీవించాలని, భవిష్యత్తు తరాలు ప్రపంచ పురోగమనములో ముందుండాలని ఆలోచించి, చదువుకు ప్రాధాన్యత ఇస్తూ అనేక పాఠశాలలు నిర్మించి, నాటి వరకు చదువుకు దూరం చేయబడ్డ ప్రజలందరినీ చదువుకోవాదడానికి దారులు వేశారని గుర్తు చేశారు. మహిళలకు సైతం చదువుకునే హక్కు మొదటి సారి కల్పించిన ఘనత మహాత్మ జ్యోతి రావు పూలే దేనని అని అన్నారు. సంఘసంస్కర్తగా అణిచివేతకు గురైన బహుజన ప్రజలకు మహాత్ముడు జ్యోతిరావు పూలే అనేక సేవలు అందించారని అన్నారు. నేడు సమాజంలో పెరిగి పోతున్న కుల, మత వివక్షతలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత పూలే ను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎఫ్ బలపరిచిన బిఎల్పి పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి గా పోటీ చేస్తున్నా వడ్ల సాయి కృష్ణ, బహుజన లెఫ్ట్ మహిళ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గంగమణి, బిఎల్ టీయూ జిల్లా నాయకులు గంగాధర్, రజక సంఘం జిల్లా నాయకులు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పూలే జీవితం ఆదర్శం.

## - బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 11:**



మహాత్మ జ్యోతిబాపూలే బహుజన ప్రజలకు విద్యను అందించడంలో ఎంతో కృషి చేసిన మహోన్నతుడని, పూలే జీవితం ఆదర్శం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా నిజామాబాద్ నగరం లోని జ్యోతిబాపూలే చౌరస్తా వద్దగల అమరవీరుల పార్కులో జ్యోతిబాపూలే విగ్రహానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిబాపూలే ప్రజలకు విద్యను అందించడంలో ఎంతో కృషి చేసిన మహోన్నతుడని, ఆయన తో పాటు సతీమణి అయినటువంటి సావిత్రిబాయి పూలే తో కలిసి మహిళలకు విద్యను అందించారు అని, ఫులే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించారు అని అన్నారు. అతను వితంతువుల కోసం ఒక గృహాన్ని స్థాపించారు అని, భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులు అని అన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు అని అన్నారు. ఫులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక సంస్కరణ

ఉద్యమంలో ఫులే ఒక మహనియుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రేవంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనుగందల మురళి, జిల్లా బీసీ నాయకులు శివ ముదిరాజ్, కస్తూరి కృష్ణ, పి.సురేష్, కుర్లె శివ, విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు నవతే ప్రతాప్, జిల్లా అధికార ప్రతినిధి అమంద్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్య క్షత్రియ మరాఠ సమాజ్ కార్యవర్గం ఎన్నిక.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 11**



నగర ఆర్య క్షత్రియ మరాఠ సమాజ్ నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం నగరంలోని నాందేవ్ వాడ విఠలేశ్వర ఆలయంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా డిగంబర్ రావ్ పవార్, ప్రధాన కార్యదర్శిగా నరెందర్ కదం, కోశాధికారిగా జ్యోతిష్వర్ సంత్ పాలేనిలు ఎన్నికయ్యారు. నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలో మరాఠ సమాజ్‌ను 50 సంవత్సరాల క్రితం స్థాపించడం జరిగిందని నూతన అధ్యక్షుడు డిగంబర్ రావ్‌పవార్ ఈ సందర్భంగా చెప్పారు. మరాఠ సమాజ్ అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు




# జ్యోతి రావు పూలే కు ఘన నివాళి.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 11:** మహాత్మ జ్యోతిబాపూలే 197 వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో జ్యోతిబాపూలే విగ్రహానికి వివిధ విద్యార్థి, ప్రజా, యువజన, ఉపాధ్యాయ, దళిత బహుజన, మైనారిటీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# పూలే సేవలు మరువలేనివి.

## - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.


**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, ఏప్రిల్ 11:**



నేటి తరం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారంటే ఆనాడు మహిళలకు చదువు ఆవశ్యకతను గుర్తించి చదువు చెప్పడంవల్లేనని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద గల పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, కుల వ్యవస్థలో లోపాలను గుర్తించి ఆనాడే సామాజిక సమానత్వం సాధన కోసం జ్యోతి బా పూలే సంస్కరణల కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. చదువుతోనే జీవితంలో మార్పు సాధ్యమని విద్య ప్రాముఖ్యతను గుర్తించి తన భార్య సావిత్రి పూలే కు చదువుచెప్పించి అందరు మహిళలు కూడా చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని భావించి కార్యోన్ముకులు కావడంవల్లే నేడు మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించారని అన్నారు. తరతరాల తలరాతను మార్చేది చదువు ఒక్కటే అని ప్రతి ఒక్కరు బాగా చదువుకోవాలని , మహనీయుల చరిత్రను తెలుసుకొని వారి ఆశలు, ఆశయాలకనుగుణంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి.అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సహాయ బిసి అభివృద్ధి అధికారి యాదగిరి, చక్రధర్ , నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిబాపులేకు నివాళులర్పించిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 11**



మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఘనంగా నివాళులర్పించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జ్యోతిబాపులే చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే అందించిన సేవలను, ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి కోసం అనితరసాధ్యమైన రీతిలో కొనసాగించిన కృషిని గుర్తు చేసుకున్నారు. పూలే జయంతి కార్యక్రమంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పూలే"జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

## - బహుజన లెఫ్ట్ పార్టీ, బిఎల్ పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ .

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 11:**



ఆధునిక భారత సామాజిక విప్లవ నిర్మాత మహాత్మా జోతిబా పూలే జీవిత చరిత్రను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని బహుజన లెఫ్ట్ పార్టీ, బిఎల్ పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. పూలే జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో గల పూలే విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దండి వెంకట్ మాట్లాడుతూ, దేశంలో మొదటి సారిగా బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేదలైన బహుజనులకు విద్య కోసం ఉద్యమించిన మహాత్మా జ్యోతిరావు పూలే, ఆయన జీవిత భాగస్వామి సావిత్రమ్మ పూలే లు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని దండి వెంకట్ కొనియాడారు. బహుజన ప్రజలందరు పూలే ఆశయాల సాధనతో పాటు సమాజ మార్పు కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చదువుతో జీవితాల్లో మార్పు సాధ్యం అని ఆనాడే చాటి చెప్పిన మహాత్మ పూలే ను ఆదర్శంగా తీసుకుని తమ పిల్లలను చదివించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళ సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి ప్రధాన కార్యదర్శి దండు జ్యోతి, నాయకురాలు బి.చిన్ను బాయి, బిఎల్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రాజేందర్, నగర అధ్యక్షులు తిట్టే రాజు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాధర్ వాగ్మారే , సాయి కాంబ్లీ, కేశవ్ గాయక్వాడ్,బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమాన్, బిసి కులాల ఫెడరేషన్ జిల్లా నాయకులు జన్నేపల్లి సత్యనారాయణలు పాల్గొన్నారు.

# అందుకే క్రేజ్..





సాయి పల్లవి ఎప్పుడు ఎక్కడ కనిపించినా కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. అదే ఆమెలోని ప్రత్యేకత. అందరిది ఒక దారి అయితే.. సాయి పల్లవిది ఇంకో దారి. డబ్బుల కోసం ఏ పని చేయదు. తనకు నచ్చితేనే చేస్తుంటుంది. అదే సాయి పల్లవికి ఇంతటి అభిమానాన్ని తెచ్చి పెట్టింది.

సినిమాల్లోకి హీరో, హీరోయిన్లు వస్తుంటారు వెళ్తుంటారు. హీరోలు ఎక్కువ కాలం సిల్వర్ స్క్రీన్‌ను ఏలుతుంటారు. ఆరు పదుల వయసు వచ్చినా కూడా హీరోల స్థాయి, ఇమేజ్, క్రేజ్ ఏ మాత్రం తగ్గదు. కానీ హీరోయిన్లకు అంత టైం ఉండదు. ఇప్పుడు వస్తున్న హీరోయిన్ల టైం అయితే మహా అంటే ఏడాది, రెండేళ్లు. అంతకు మించి స్టార్డంను కాపాడుకోలేకపోతోన్నారు. ఒకప్పుడు త్రిష, శ్రియ వంటి వారు దశబ్దానికి పైగా తమ తమ క్రేజ్, ఫాలోయింగ్, స్టార్ స్టేటస్‌ను కాపాడుకుంటూ వచ్చారు. పూజా, రష్మిక గత మూడు నాలుగేళ్లుగా టాప్ పొజిషన్‌ను చూశారు. కానీ ఇప్పుడు వారికి కూడా అంత డిమాండ్ లేదు. అలా హీరోయిన్లు సీజన్లు మారినట్టుగా మారిపోతోంటారు. గతంలో కృతి శెట్టి ట్రెండ్ నడిచింది. ఇప్పుడు శ్రీలీల హవా నడుస్తోంది. కానీ ఎంత మంచి వచ్చినా, ఎంత మంది వెళ్లినా కొందరి పేర్లు ఎప్పటికీ గుర్తుంటాయి. వారు వేసిన ముద్ర ఎప్పటికీ అలానే ఉంటుంది. సావిత్ర, సౌందర్య, సాయి పల్లవి అనే రేంజ్‌కి సాయి పల్లవి వెళ్లిపోయింది. సాయి పల్లవి సినిమాలు చేసినా, చేయకపోయినా ఆమె మీద ప్రేక్షకులకుండే ప్రేమ, గౌరవం మాత్రం తగ్గదు.

హీరోయిన్లు అలాంటి ప్రేమను, గౌరవాన్ని సంపాదించుకోవడం అంత సులభమైన పని కాదు. డబ్బే పరమావధిగా వచ్చేవాళ్లు, డబ్బు కోసమే సినిమాలు చేసేవాళ్లు, తమకంటూ ఓ ఆత్మ గౌరవాన్ని నిలుపుకోలేని వాళ్లకు అలాంటి ఓ రెస్పెక్ట్ రాదు. సాయి పల్లవి డబ్బుకు అతీతం. డబ్బు కోసం సినిమాలు చేయదు. నటన అంటే ఇష్టం కాబట్టి, తన పాత్రకు ప్రాధాన్యం ఉంటేనే సినిమాలు చేస్తుంది. కోట్లు కుమ్మరించినా వాణిజ్య ప్రకటనలకు ఒప్పుకోదు. ఎంత డబ్బు ఇచ్చినా హద్దు దాటే సీన్లకు అంగీకరించదు. సాయి పల్లవికి ఈ గుణాలే అభిమానులు గుండెల్లో చోటు దక్కించుకునేలా చేశాయి.

ఇక న్యూ ఇయర్ వచ్చిందంటే పార్టీలు, పబ్బులు, వెకేషన్లంటూ ఫారిన్ దేశాలకు తిరిగే టైపు అసలే కాదు. న్యూఇయర్ అంటే చీరకట్టుతో చక్కగా రెడీ అవ్వడం, గుడికి వెళ్లడం వంటివి చేస్తుంటుంది సాయి పల్లివి. గత ఏడాది న్యూ ఇయర్ స్పెషల్‌గా సాయి పల్లవి వీడియో ఒకటి చక్కర్లు కొట్టింది. అందరితో పాటు కూర్చుని ధ్యానం, యోగా, పూజలు అంటూ పాల్గొంది. ఇక ఇప్పుడు ఇంట్లోనే ఇలా చెల్లితో టైం గడిపినట్టుగా ఉంది. సాయి పల్లవితో ఆమె సోదరి పూజా కన్నన్ ఇలా చీరకట్టుతో కనిపించి న్యూ ఇయర్‌ను మరింత అందంగా మలిచింది. ప్రస్తుతం సాయి పల్లవి తెలుగులో నాగ చైతన్యతో తండేల్, తమిళంలో శివ కార్తికేయన్‌తో ఓ సినిమా చేస్తోంది.

# 'గేమ్ చేంజర్' పని పట్టనున్న శంకర్!

ఇండియన్ 2 మూవీ షూటింగ్‌ను శంకర్ కంప్లీట్ చేసినట్టుగా తెలుస్తోంది. ఇన్ని రోజులు రెండు చిత్రాలను సమాంతరంగా షూట్ చేస్తూ వస్తున్న శంకర్.. మొత్తానికి ఇండియన్ 2 చిత్రీకరణను పూర్తి చేసేశాడు. ఇకపై గేమ్ చేంజర్ మీదే తన ఫోకస్ పెట్టనున్నట్టుగా తెలుస్తోంది.





ఇండియన్ 2 సినిమా విషయంలో శంకర్‌కు ఎన్ని అడ్డంకులు వచ్చాయో అందరికీ తెలిసిందే. షూటింగ్‌లో ప్రమాదం జరగడం, టీం మెంబర్లు చనిపోవడంతో సినిమానే పక్కన పెట్టేశారు. ఆ తరువాత కమల్ హాసన్ సైతం వేరే ప్రాజెక్టుల మీద ఫోకస్ పెట్టాడు. విక్రమ్ తీశాడు. ఇక శంకర్ సైతం వేరే సినిమాల మీద దృష్టి పెట్టాడు. ఆ టైంలోనే రామ్ చరణ్‌తో గేమ్ చేంజర్ కథను పట్టాలెక్కించారు. కానీ మళ్లీ ఇండియన్ 2 లైన్లోకి వచ్చింది. దీంతో గేమ్ చేంజర్ కాస్త ముందుకు వెనక్కి అన్నట్టుగా వెళ్తోంది. మధ్యలో కమల్ హాసన్, రామ్ చరణ్‌ల మూవీలను సమాంతరంగా పూర్తి చేస్తూ వచ్చాడు శంకర్. నెలలో సగం రోజులు అటూ, సగం రోజులు ఇటూ అన్నట్టుగా శంకర్ ఫుల్ బిజీ అయ్యాడు. శంకర్ లేకుండా అసిస్టెంట్లతో షూటింగ్ చేస్తున్నాడనే విమర్శలు, రూమర్లు ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. వాటిని చిత్రయూనిట్ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంటుంది. అయితే ఇప్పుడు శంకర్ తన ఇండియన్ 2 మూవీ షూటింగ్‌ను పూర్తి చేసినట్టుగా తెలుస్తోంది. ఇండియన్ 2 కాకుండా.. మూడో పార్టుకు సంబంధించిన షూటింగ్ కూడా జరిగినట్టుగా తెలుస్తోంది. ముందు రెండో పార్ట్‌ను రిలీజ్ చేసి ఆ తరువాత కాస్త గ్యాప్‌తో మూడో పార్ట్‌ను విడుదల చేస్తారని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు మాత్రం ఇండియన్ 2 షూట్ పూర్తయిందని చెబుతున్నారు. అయితే ఈ లాస్ట్ డే షూటింగ్‌కు శంకర్ రాలేదా? శంకర్ లేకుండానే షూటింగ్ చేశారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. చివరి రోజు చిత్రయూనిట్‌తో కలిసి కమల్ హాసన్ ఫోటోకు పోజిచ్చాడు. కానీ ఈ ఫోటోల్లో మాత్రం శంకర్ కనిపించడం లేదేంటి? అని జనాలు వెతుకుతున్నారు. ఇక ఈ మూవీ షూటింగ్ పూర్తవ్వడంతో శంకర్ తన పూర్తి సమయాన్ని గేమ్ చేంజర్ కోసం వెచ్చించేలా ఉన్నాడు. గేమ్ చేంజర్ షూటింగ్ త్వరగా పూర్తయితే బుచ్చిబాబు ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని రామ్ చరణ్ వెయిట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాదిలోనే బుచ్చిబాబు ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేలా కనిపిస్తు న్నారు. ఆల్రెడీ రెహమాన్‌తో మ్యూజిక్ సిట్టిం గ్స్ కూడా జరిగినట్టుగా సమాచారం. శంకర్ తీస్తోన్న గేమ్ చేంజర్‌లో సముద్రఖని, శ్రీకాంత్, అంజలి ఇలా చాలా మంది ముఖ్య పాత్రలను పోషిస్తున్న సంగతి తెలిసిందే. పుణె, అమృత్ సర్, రాజమండ్రి, వైజాగ్, హైద్రాబాద్ ఇలా పలు చోట్ల గేమ్ చేంజర్ షూటింగ్ చేసిన సంగతి తెలిసిందే. రామ్ చరణ్ ఇందులో మూడు విభిన్న గెటప్పుల్లో కనిపించబోతోన్నాడు. ఈ చిత్రం ఈ ఏడాది సెప్టెంబర్‌లో రిలీజ్ అయ్యేందుకు అవకాశాలున్నాయి.

# హైదరాబాద్ డీఎస్పీగా బెల్లంకొండ



ప్రస్తుతం సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో బెల్లంకొండ ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. యాక్షన్ సినిమాలకు పెట్టింది పేరు టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్. అయితే హిందీలో ఛత్రపతి రీమేక్ చేయడం వల్ల ఆయన తెలుగు సినిమాలకు మూడేళ్ల బ్రేక్ వచ్చింది. ప్రస్తుతం సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో బెల్లంకొండ ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ నుంచి స్పెషల్ అప్డేట్ వచ్చింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఈ సినిమాలో హైదరాబాద్ నగర డీఎస్పీగా కనిపించనున్నారు. ఈ విషయాన్ని కాస్త వినూత్నంగా తెలిపింది చిత్రయూనిట్. ప్రజా ప్రయోజనాల కోసం ఓ నోటీసు జారీ చేశారు మేకర్స్. త్రివిక్రమ్.. మల్టీస్టారర్ ప్లానా? అందులో ఓ యంగ్ డైనమిక్ ఆఫీసర్ కు హైదరాబాద్ డీఎస్పీగా పోస్టింగ్ వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు. ఫ్యాన్స్ తో పాటు మీడియాకు నోటీస్ కాపీ ఇచ్చినట్లు చెప్పారు. దీంతో ఈ మూవీలో లాఠీ పట్టనున్న బెల్లంకొండ.. మాస్ యాక్షన్ తో అదరగొట్టనున్నారన్న మాట. సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. హీరోగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 10వ చిత్రమిది. అందుకే వర్కింగ్ టైటిల్‌తో చిత్రీకరిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. విజయ్, వెంకట్, రియల్ సతీశ్ మాస్టర్లు యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. అయితే జనవరి 3వ తేదీ బెల్లంకొండ పుట్టినరోజు కనుక.. %దీూా%10 మూవీ యూనిట్ సాలిడ్ అప్డేట్ ఇవ్వనుంది. టైటిల్, హీరో ఫస్ట్ లుక్ రిలీజ్ చేయనుంది. ఈ మూవీకి టైసన్ నాయుడు అనే పేరు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ఈ టైటిల్ దివంగత నటుడు శ్రీహరి సినిమాకు అనుకున్నారట. కానీ ఆ తర్వాత శేషాద్రి నాయుడు అని పెట్టినట్లు తెలిసింది. శ్రీహరిని హీరోగా చేసింది బెల్లంకొండ సురేశ్ అన్న విషయం తెలిసిందే. ఈ సినిమాతోపాటు బెల్లంకొండ... మున్నా దర్శకత్వంలో మరో మూవీ చేస్తున్నారు. సోషియో ఫాంటసీ జోనర్ లో రూపొందుతున్న ఆ సినిమాకు దేవుడే దిగి వచ్చినా టైటిల్ ఫిక్స్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ టైటిల్ ను పవన్, సాయి ధరమ్ తేజ్ కాంబోలో రూపొందిన బ్రో మూవీకి అప్పుడు పెడదామను కున్నారట కానీ కుదరలేదట.

# శ్రద్ధా శ్రీనాథ్ ఎదపై టాటూ అర్థమిదేనట

కన్నడ బ్యూటీ అయిన శ్రద్ధా శ్రీనాథ్ తెలుగులో బాగానే పాపులర్ అయింది. అయితే శ్రద్ధా మాత్రం తనకు నచ్చిన, మెచ్చిన స్క్రిప్టులను మాత్రమే ఎంచుకుంటూ ఎంతో సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తూ వస్తోంది. ఈ సంక్రాంతికి సైంధవ్‌లో వెంకీమామతో కలిసి ప్రేక్షకులను పలకరించబోతోంది.

సైంధవ్ సినిమాతో వెంకటేష్ ఈ సారి సంక్రాంతి బరిలో సందడి చేయబోతోన్నాడు. వెంకీ మామ, శైలేష్ కొలను కలిసి చేసిన ఈ సైంధవ్‌లో పాప సెంటిమెంట్ హైలెట్ అయ్యేలా కనిపిస్తోంది. తండ్రీ కూతుళ్ల ఎమోషన్ ట్రాక్, అందులో వెంకీ మామ నటన అంటే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇక శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్‌గా చాలా గ్యాప్ తరువాత కనిపిస్తోంది. జెర్సీ మంచి హిట్ అయినా, నటిగా గుర్తింపు వచ్చినా కూడా ఆమె మాత్రం చకచకా ప్రాజెక్టులు చేయడం లేదు. ఇదే విషయాన్ని తాజాగా శ్రద్ధా శ్రీనాథ్ చెప్పేసింది. తాను ఏదో ఒక సినిమా చేసేయాలి.. డబ్బులు సంపాదించాలని తాను ఇండస్ట్రీలోకి రాలేదని అంటోంది. తాను నటిగా నిరూపించుకునే పాత్రలు లభించినప్పుడు, మంచి సినిమాలు మాత్రమే చేస్తానని చెప్పుకొచ్చింది. ఏదో ఒక సినిమా చేయాలనే ఉద్దేశం తనకు ఉండదట. ప్రేమ, బ్రేకప్ వంటి కాన్సెప్టులతో వచ్చే చిత్రాలు, ఆ జానర్లు అంటే తనకు చాలా ఇష్టమని చెప్పుకొచ్చింది. అందుకే శ్రద్ధా శ్రీనాథ్ కృష్ణ అండ్ హిజ్ లీలా, జెర్సీ వంటి ఎమోషనల్ డ్రామాలను ఎంచుకుందన్న మాట. పా రంజిత్‌తో ఓ సినిమా చేయాలని తనకు ఉందని చెప్పుకొచ్చింది శ్రద్ధా శ్రీనాథ్. తన టాటూని కూడా గమనిస్తున్నారా? వావ్ అంటూ శ్రద్ధా శ్రీనాథ్ మురిసిపోయింది. ఆ టాటూకి లవ్ అని అర్థమంట. అది బీటల్స్ మ్యూజిక్ బ్రాండ్ లోగో అని చెప్పుకొచ్చింది. అది తన క్రష్. పద్దెనిమిదేళ్ల వయసులో అతడు క్రష్‌గా ఉండేవాడట. అతనే ఆ మ్యూజిక్ బ్యాండ్‌నే పరిచయం చేశాడట. అలా క్రష్‌నే టాటూగా వేయించుకుందట. క్రష్ మాత్రమే లవ్ కాదు.. క్రష్‌కి కూడా టాటూ వేయించుకుంటారా? అని యాంకర్ అడిగితే.. శ్రద్ధా శ్రీనాథ్ నవ్వేసింది. కన్నడ యూటర్న్ మూవీలో శ్రద్ధా శ్రీనాథ్ అద్భుతంగా నటించేసింది. తెలుగులోనూ ఒక వేళ సమంతకు కాకుండా తనకు ఆ పాత్ర ఇచ్చి ఉంటే.. ఇంకా బాగా నటించేదాన్నంటూ ఆ మధ్య శ్రద్ధా శ్రీనాథ్ చెప్పిన మాటలు బాగానే వైరల్ అయ్యాయి.

# స్క్రీన్ షాట్ షేర్ చేసిన రవీంద్రన్






రాహుల్ రవీంద్రన్ నెట్టింట్లో ఫుల్ యాక్టివ్‌గా ఉంటాడు. ట్విట్టర్, ఇన్‌స్టాలో రాహుల్ రవీంద్రన్ ఎక్కువగా స్పందిస్తుంటాడు. తాజాగా నందినీ రెడ్డి చెప్పిన న్యూ ఇయర్ విషెస్ మీద రాహుల్ రవీంద్రన్ కౌంటర్ వేశాడు. అంతే కాకుండా వాట్సప్ స్క్రీన్ షాట్‌ని కూడా షేర్ చేశాడు. రాహుల్ రవీంద్రన్, నందినీ రెడ్డి ఇలా అంతా కూడా ఓ గ్యాంగ్ అన్న సంగతి తెలిసిందే. సమంత, చిన్మయి, రాహుల్ రవీంద్రన్, వెన్నెల కిషోర్, నందినీ రెడ్డి ఇలా వీరి గ్యాంగ్ చాలా పెద్దగానే ఉంటుంది. వీరంతా కలిసి బాగానే సందడి చేస్తుంటారు. ఇక తాజాగా న్యూ ఇయర్ సందర్భంగా నందినీ రెడ్డి చెప్పిన విషెస్‌కు రాహుల్ షాక్ అయ్యాడు. ఈ ఏడాది అయినా ఓ గర్ల్ ఫ్రెండ్‌ను సంపాదించుకో అన్నట్టుగా కౌంటర్లు వేసింది. ఏంటి ఇలా ఎవరైనా విషెస్ చెబుతారా? అంటూ రాహుల్ ఆశ్చర్యపోయాడు. ప్రస్తుతం వీరిద్దరి ట్వీట్ల ముచ్చట్లు వైరల్ అవుతున్నాయి.

న్యూ ఇయర్ సందర్భంగా రాహుల్‌కు నందినీ విషెస్ చెప్పింది. హ్యాపీ న్యూ ఇయర్ రాహులా.. ఈ ఏడాది అయినా నీకు అద్భుతమైన గర్ల్ ఫ్రెండ్ దొరకాలని కోరుకుంటున్నా.. నీ వైఫ్ కూడా నాకు తెలిసి ఇదే కోరుకుంటుంది.. ఆమె ఏమీ అనుకోదు..ఆమె కూడా అంగీకరిస్తుందిలే అంటూ మెసెజ్ పెట్టింది. వాట్సప్‌లో నందినీ పెట్టిన ఈ మెసెజ్‌ను స్క్రీన్ షాట్ తీసి ట్వీట్ వేశాడు. నందినీ తప్పా ఇంకెవ్వరూ ఇలా విషెస్ చెప్పలేరు అంటూ నవ్వేశాడు రాహుల్ రవీంద్రన్.

అయితే రాహుల్ రవీంద్రన్ పెట్టిన ఈ స్క్రీన్ షాట్‌లో జనాలు చాలానే గుర్తిస్తున్నారు. 1100కి పైగా మెసెజ్‌లు ఉన్నాయేంటి? బ్రో.. నువ్వు ఇంకా 4జీ వాడుతున్నావా? అంటూ ఇలా పలురకాలుగా ప్రశ్నలు వేస్తున్నారు. సెట్స్‌కు వెళ్తే.. ప్యాకప్ చెప్పిన తరువాతే మళ్లీ ఫోన్ వాడతాను అందుకే.. అలా చాలా మెసెజ్‌లు ఉండిపోయాయ్ అంటూ రాహుల్ క్లారిటీ ఇచ్చాడు. ఈ వాట్సప్ చాట్‌ను చిన్మయి చూస్తే ఎలా రియాక్ట్ అవుతుందో.. ఎంతకి తెగించార్రా అని అంటుందేమోనంటూ నెటిజన్లు ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. చిన్మయి కాపురంలో చిచ్చు పెట్టాలని చూస్తున్నారా? అంటూ ఇంకొంత మంది కామెంట్లు పెడుతున్నారు. మొత్తానికి ఈ దర్శకులిద్దరి సంభాషణ మాత్రం నెట్టింట్లో బాగానే చర్చకు దారి తీస్తోంది. రాహుల్ ప్రస్తుతం రష్మికతో ది గర్ల్ ఫ్రెండ్ అనే సినిమాను తీస్తున్న సంగతి తెలిసిందే.

# మల్టీస్టారర్ ప్లానా?



అసలైతే అల్లు అర్జున్ త్రివిక్రమ్ మరొక సినిమా చేయబోతున్నట్లు అఫీషియల్ గా ఆ మధ్య క్లారిటీ అయితే వచ్చింది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ గుంటూరు కారం సినిమా తర్వాత ఎలాంటి సినిమా చేస్తాడా అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉన్నారు. అసలైతే అల్లు అర్జున్ త్రివిక్రమ్ మరొక సినిమా చేయబోతున్నట్లు అఫీషియల్ గా ఆ మధ్య క్లారిటీ అయితే వచ్చింది. కానీ బన్నీ ప్రస్తుతం పుష్ప 2 సినిమాతో చాలా బిజీగా ఉన్నాడు. ఆ ప్రాజెక్టుకు ఆగస్టులో రాబోతున్న విషయం తెలిసిందే. ఇక త్రివిక్రమ్ బన్నీతో చేయబోయే ప్రాజెక్టుకు సంబంధించిన స్క్రిప్ట్ పనులను కూడా దాదాపు ఫినిష్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది. మరోసారి హీరోతో కూర్చుని పూర్తిస్థాయిలో మరో ప్రణాళిక సిద్ధం చేసుకునే అవకాశం ఉంది. అయితే అల్లు అర్జున్ ఆగస్టు వరకు బిజీ కానున్నాడు ఇక త్రివిక్రమ్ గుంటూరు కారం మరో రెండు వారాల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఇప్పుడు గుంటూరు కారం తర్వాత త్రివిక్రమ్ బన్నీ కోసం 8 నెలలు ఎదురుచూస్తాడా లేదంటే ఈ గ్యాప్ లో ఏదైనా మరొక ప్రాజెక్టును తొందరగా ఫినిష్ చేస్తాడు అని సందేహాలు వస్తూ ఉన్నాయి. ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్ ప్రకారం అయితే ప్రముఖ హీరోలతో త్రివిక్రమ్ ఒక మల్టీ స్టార్ సినిమా చేసే అవకాశం ఉన్నట్లుగా టాక్ అయితే వినిపిస్తోంది. అది కూడా కామెడీ కంప్లీట్ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ లో ఉంటుందట. మొన్నటి వరకు త్రివిక్రమ్ నాని కాంబో అంటూ రూమర్స్ సౌండ్ కాస్త ఎక్కువగానే వినిపించింది కానీ అందులో ఎలాంటి నిజం లేదని కూడా సన్నిహిత వర్గాల ద్వారా క్లారిటీ వచ్చేసింది. అయితే వెంకటేష్‌తో కూడా ఒక సినిమా అయితే చేయాల్సి ఉంది. పదేళ్ళ నుంచి ఈ కాంబినేషన్ లో సినిమా పట్టాలు ఎక్కడం లేదు. ఇక ఆయనతోపాటు మరొక హీరో రామ్ తో కూడా సినిమా చేస్తారు అని స్రవంతి రవి కిషోర్ కు ఎప్పుడో మాట ఇచ్చారు. బహుశా ఇద్దరితో మల్టీస్టారర్ ప్రాజెక్టు రావచ్చు అని టాక్ వినిపిస్తుంది. గతంలో రామ్ వెంకీ మసాలా అనే సినిమా చేశారు. ఇక రీసెంట్ గా వెంకటేష్ మెగాస్టార్ చిరంజీవితో మల్టీస్టారర్ సినిమా ఉంటుంది అని చెప్పడం కూడా ఈ కాంబోపై ఊహగానాలకు తెరలేపింది. ఏదేమైనా వెంకటేష్ తో మాత్రం త్రివిక్రమ్ మల్టీస్టారర్ చేసే ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాలి అంటే అధికారికంగా క్లారిటీ వచ్చేవరకు ఆగాల్సిందే.

# ఆదిలోనే హంసపాదు!




అటుపై ఇద్దరు కాంబినేషన్ లో భారీ ప్రయోగమే జరుగుతుందని ఆన్స్ సెట్స్ నుంచి లీకైంది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ 68వ చిత్రం ప్రకటనతో అంచనాలు ఏ రేంజ్ కి వెళ్లాయో తెలిసిందే. అప్పటికే టాలీవుడ్ నాగచైతన్యకి వెంకట్ ప్రభు ఫ్లాప్ ఇచ్చినా..ఆయన గత విజయాలు.. విజయ్ ఇమేజ్ తో 68వ చిత్రంపై అంభిమానుల్లో అంచనాలు అమాంతం పెంచేసాయి. కస్టడీ ఇంప్టాక్ట్ విజయ్ పై ఏమాత్రం పడలేదు. అటుపై ఇద్దరు కాంబినేషన్ లో భారీ ప్రయోగమే జరుగుతుందని ఆన్స్ సెట్స్ నుంచి లీకైంది. ఇది భారీ ప్రయోగాత్మక చిత్రమని మరోసారి నెట్టింట గట్టిగానే ప్రచారం సాగింది. అంచనాలు రెట్టింపు అయ్యాయి. కానీ ఇవన్నీ పోస్టర్ చిత్రాలు చూస్తుంటే అంచనాలన్ని ఆవిరవుతున్నట్లే కనిపిస్తుంది. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ న్యూ ఇయర్ సందర్భంగా నిన్న ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టర్ చూసి అభిమానులు సహా అంతా షాక్ అయ్యారు. ఈ పోస్టర్ ఏంటి? ఇలా ఉంది? అనే చర్చకు తెర తీసింది. డిజైన్ చేసిన పోస్టరా? లేక ఏఐ టెక్నాలజీతో రూపొందించిందా? అన్న సందేహం మొదలైంది. విజయ్ డ్యూయల్ పోషిస్తున్నారు అన్నది ముందే తెలిసిన అంశం. కానీ ఈపోస్టర్ చూసిన తర్వాత రకరకాల సందేహాలు మొదలయ్యాయి. పోస్టర్ పై పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరుగుతోంది. విజయ్ అభిమానుల్ని సైతం ఈ పోస్టర్ తీవ్ర నిరాశ పరిచింది. మాస్ హీరో నుంచి ఇలాంటి పోస్టర్ ఏమాత్రం ఊహించనదిగా భావిస్తున్నారు. ఒక రోల్ పై ప్రత్యేకంగా పనిగట్టుకుని మరీ ట్రోలింగ్ జరుగుతోంది. అందులో ఓ పాత్రని ఏదో కామిక్ గా చూపించినట్లు ఉందని అంటున్నారు. టైటిల్ కి ....పోస్టర్ కి ఏమాత్రం సంబంధం లేనట్లుగా ఉందంటున్నారు. ఇలా ఆదిలోనే విజయ్ 68పై విమర్శల పర్వం మొదలైంది. మరి వీటికి ఈ ద్వయం ఎలాంటి ముగింపు పలుకుతుంది? అన్నది చూడాలి. మరి కోలీవుడ్ కమర్షియల్ స్టార్ తో ఎలాంటి ప్రయోగం చేయిస్తున్నాడో చూడాలి.

# లక్ అంటే కుర్ర హీరోదే



పెట్టిన కొత్తలో హీరోలకు మంచి కథలు దొరకడం అంత ఈజీ కాదు ఇండస్ట్రీలో అడుగు పెట్టిన కొత్తలో హీరోలకు మంచి కథలు దొరకడం అంత ఈజీ కాదు. కాన్సెప్ట్ ఓరియంటెడ్ కథలు, కమర్షియల్ కథలు ఎక్కువగా స్టార్ కిడ్స్ వద్దకు, స్టార్ ఫ్యామిలీ హీరోల వద్దకు వెళ్తూ ఉంటాయి. అలాంటిది తేజ సజ్జా ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పటి నుంచి కూడా మంచి కాన్సెప్ట్ కథలు దక్కించుకుంటూ ఉన్నాడు. జాంబీ రెడ్డి సినిమా కథ ఎంతటి వైవిధ్యభరితంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు అదే తరహా లో హనుమాన్ సినిమా కూడా ఉంటుదని అంటున్నారు. సూపర్ మ్యాన్ స్టోరీ అంటూ హనుమాన్ ను ప్రమోషన్ చేస్తున్నారు. ఈ సంక్రాంతికి తేజ హనుమాన్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇది అసలు మ్యాటర్ హనుమాన్ విడుదల అవ్వకుండానే మరో సూపర్ హీరో కాన్సెప్ట్ సినిమాను తేజ ఓకే చేశాడు.. ఆ సినిమా షూటింగ్ దాదాపుగా సగం పూర్తి అయిందని సమాచారం అందుతోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ హీరోగా ఆ సూపర్ హీరో కథ సినిమా ఇప్పటికే ప్రారంభం అయింది. కార్తీక్ కి రవితేజ నుంచి ఈగల్ ఆఫర్ రావడంతో పాటు తేజ హనుమాన్ సినిమాను భారీ స్థాయిలో చేయాలనే ఉద్దేశ్యంతో ఆ సినిమాను పక్కన పెట్టడం జరిగింది. హనుమాన్ విడుదల అయిన వెంటనే తేజ మరియు కార్తీక్ లు కలిసి ఆ సినిమా బ్యాలెన్స్ వర్క్ పూర్తి చేసి ఇదే ఏడాదిలో విడుదల చేసే విధంగా ప్లాన్ చేస్తున్నారట. వరుసగా సూపర్ హీరో కాన్సెప్ట్ సినిమా ఛాన్స్ దక్కించుకున్న తేజ నిజంగా లక్కీ హీరో అంటూ మీడియా వర్గాల వారు మరియు ఇండస్ట్రీ వర్గాల్లో కొందరు కామెంట్ చేస్తున్నారు.